క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

రాజాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన.. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఈ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎదురుగా రాజకీయ పార్టీల నాయకులు టెంట్లు వేయడం, పార్టీ గుర్తులతో పోలింగ్ కేంద్రాల్లోకి రావడం, ఓటర్లను మభ్యపెట్టడం వంటివి చేయరాదన్నారు. ఇప్పటివరకు 1968 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, ప్రతీ మండలంలో సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. మొత్తం 12 బృందాలు ఎన్నికల పర్యవేక్షణ చేస్తున్నాయన్నారు.

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడా ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదని సీఐ తిరుమలరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్ విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన.. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

వంగర: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే పోలీసులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ వై.వి.జనార్దన్ తెలిపారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మండలంలోని లక్ష్మీపేట పోలీస్ ఔట్ పోస్ట్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా ఎన్నికల్లో గొడవలు జరగకుండా సహకరించాలని కోరారు.

గుర్తింపుకార్డు తప్పనిసరి

రాజాం: ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటరు స్లిప్పుతో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ తెలిపారు. ఇదే విషయమై ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే వారంతా ఆధార్‌కార్డు గానీ, ఓటరు కార్డు గానీ తెచ్చుకోవాలన్నారు.

అభివృద్ధిలో బొబ్బిలి టాప్!

మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని బొబ్బిలి ఇప్పుడు ప్రగతి బాట పట్టింది. ఇదివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పట్టణం పరిస్థితి కనిపించేది. అన్నిప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కొనసాగిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన ఫలితంగా బొబ్బిలి మున్సిపాలిటీలో ప్రగతి పవనాలు వీచాయి. 14, 15వ ఆర్థికసంఘం నిధులు సహా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో అభివృద్ధి పనులు చకచకా జరిగాయి. 30 ఏళ్ల తర్వాత మున్సిపాలిటీ రూపురేఖలు మారి, సరికొత్తగా దర్శనమివ్వడంతో ప్రభుత్వ పనితీరును పట్టణవాసులు అభినందిస్తున్నారు. – బొబ్బిలి.

- మూడు దశాబ్దాలుగా బొబ్బిలిలో కానరాని ప్రగతి
- వైఎస్సార్ సీపీ హయాంలో శరవేగంగా అభివృద్ధి
- 14, 15వ ఆర్థికసంఘం, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో విస్తృతంగా పనులు
- రూ.24.93 కోట్లతో రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రోడ్ల విస్తరణ
- 30 ఏళ్లలో లేని మార్పు, ఐదేళ్లలో సాధ్యం కావడంపై సర్వత్రా హర్షం


రూ.4 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన పట్టణ ప్రధాన రహదారి


గతంలో వర్షమొస్తే ఇదీ గాయత్రి డిగ్రీ కాలేజ రోడ్డు పరిస్థితి


అదే దారిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన రోడ్డు


గతంలో నాయుడుకాలనీ జంక్షన్‌లోని మట్టిరోడ్డు ఇలా..


అదే జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన సీసీ రోడ్డు

14వ ఆర్థికసంఘం నిధులతో..
- మంజూరైన పనులు 233, మంజూరైన నిధులు రూ.13.84 కోట్లు
- పూర్తయిన పనులు 210, ఖర్చు చేసిన నిధులు రూ.11.70 కోట్లు

15వ ఆర్థికసంఘం నిధులతో..
- మంజూరైన పనులు 72, మంజూరైన నిధులు రూ.3.98 కోట్లు
- పూర్తయిన పనులు 06, ఖర్చు చేసిన నిధులు రూ.99 లక్షలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో
- మంజూరైన పనులు 80, మంజూరైన నిధులు రూ.3.11 కోట్లు
- పూర్తయిన పనులు 42, ఖర్చు చేసిన నిధులు రూ.1.34 కోట్లు
- టీడీపీ హయాంలో మధ్యలో వదిలేసిన ప్రధాన రహదారి విస్తరణకు ఖర్చు చేసినది రూ.4 కోట్లు


చాలా ఏళ్ల తర్వాత పెద్దబజారులో వేసిన కొత్త రోడ్డు

రక్తదానం.. ప్రాణదానం..

రాజాం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, మనం దానం చేసిన రక్తం మరొకరి ప్రాణం నిలబెడుతుందని విషయం అందరూ గుర్తుంచుకోవాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో ఇటీవల మృతి చెందిన బండి సత్యవతి జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలి భర్త బండి కృష్ణ, కుమారులు శ్రీనివాసరావు, నర్సింహులు, కోటేశ్వరరావులు నేత్రదానానికి ముందుకు రావడంతో పాటు ఇలా రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నేత్రదానం, రక్తదానం చాలా గొప్పవని, సత్యవతి కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకుని, యువత ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న 40 మంది యువకులు రక్తం దానం చేశారని రెడ్‌క్రాస్ సభ్యుడు పెంకి చైతన్యకుమార్ తెలిపారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

సర్వం సిద్ధం!

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం సిబ్బంది చేరుకున్నారు. నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్.


రాజాం నుంచి ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరి వెళ్తున్న సిబ్బంది


రాజాం: పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న సిబ్బంది


బొబ్బిలి: పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి


బాడంగి: గజరాయునివలసలో ఓటింగ్‌కు ఏర్పాట్లు


తెర్లాం: పెరుమాళిలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు


రామభద్రపురం: పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది


రేగిడి: కాగితాపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు


సంతకవిటి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


రేగిడి: చిన్నశిర్లాం పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది


బొబ్బిలి: ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

